
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.0
ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి
5
శుక్రవారం 19 సెప్టెంబరు 2025


ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588 (306.1010)	2,11,962	2,11,962
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.78 (4.14)	9,510.93	10,900.54
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.734 (42.3253)	1,60,638	2,55,299

చికెన్ ధరలు: లైవ్ : రూ.152 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260

పండుగ పూట పస్తులేనా ?

- ప్రభుత్వ ఉద్యోగులకు రెండు, మూడు నెలలుగా అందని వేతనాలు
- పండుగలోపైనా ఇస్తారో లేదోనని ఆందోళన



పండుగకు కొడుకు, బిడ్డ ఇంటికొస్తరు. కొత్తదుస్తులు కొనివ్వాలి. పిండివంటలు చేసుకోవాలి. పిల్లలకు టపాసులు కొనివ్వాలనుకునే వీరికి... పండుగ పూట పస్తులేనా? అన్న సంశయం నెలకొంది. పేద, ధనిక అనే తేడా లేకుండా ఎంతో ఆశగా జరుపుకునే దసరాకు జీతాలు రాక, జేబులో చిల్లిగవ్వ లేక జిల్లాలోని స్కావెంజర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామపంచాయతీ కార్మికులు అప్పు కోసం ఎదురు చూస్తున్నారు. ఇంకో వారం పదిరోజుల్లో పండుగలొస్తున్న వేళ జీతాలు వస్తాయా? రావా? అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

కొందరివి పేరుకే ప్రభుత్వ ఉద్యోగాలు. వేతనం చూస్తే తక్కువ. నెలనెలా చేతికి అందుతుందా? అంటే అదీ లేదు. ఏ రెండు, మూడు నెలలకోసారి ఇస్తారు. ప్రభుత్వం వేతనాలు నెలనెలా ఇవ్వకపోవడంతో వారు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 21న ఎంగిలిపువ్వు బతుకమ్మ, 29న సద్దుల బతుకమ్మ, అక్టోబరు 2న దసరా ఉండటంతో పండుగల లోపైనా ప్రభుత్వం వేతన బకాయిలు చెల్లిస్తుందా? లేక పండుగలకు పస్తులేనా? అని పాఠశాలల్లో పనిచేసే స్కావెంజర్లు, ఉపాధి హామీ పథకంలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామపంచాయతీ కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

స్కావెంజర్లకు మూడు నెలలుగా వేతనాల్లేవు

ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య పనులు చేసే స్కావెంజర్లకు నెలనెలా వేతనాలు అందడం లేదు. ఈ ఏడాది జూన్ 2న తెలంగాణ ఆవిర్భావం రోజున ప్రారంభమైన బడిబాట కార్యక్రమం నుంచి వీరు విధులు నిర్వహిస్తున్నారు. అది లెక్కలోకి తీసుకోకపోయినా జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభమయ్యాయి. సెప్టెంబరు 15 రోజులు దాటినా స్కావెంజర్లకు ఇంతవరకు వేతనాలు అందలేదు. సెప్టెంబరు నడుస్తున్న నెల అనుకున్నా మూడు నెలల వేతనాలు వారికి చెల్లించాల్సి ఉంది. బడ్జెట్ వస్తేనే వారికి వేతనాలు చెల్లిస్తారు. సింగరేణి బొగ్గు గనుల సంస్థ నుంచి ఇటీవల బడ్జెట్ విడుదల అయ్యిందని చెబుతున్నప్పటికీ వారికి వేతనాలు ఎప్పుడు ఇస్తారు, ఎన్ని నెలల వేతనాలు ఇస్తారన్న దానిపై స్పష్టత లేదంటున్నారు.

జిల్లాలో 657 పాఠశాలలు

జిల్లాలో 657 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. తక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలల్లో ఒక్కరు, ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఇద్దరు చొప్పున స్కావెంజర్లు పనిచేస్తున్నారు. ప్రభుత్వ రికార్డుల్లో పేర్లు లేని స్కావెంజర్లు గత ప్రభుత్వం (బీఆర్ఎస్) పాఠశాలల్లో స్కావెంజర్లను తొలగించి, పాఠశాలల పారిశుధ్య పనులు కూడా గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులతో చేయించుకోవాలని చెప్పింది. తమకు గ్రామ పారిశుధ్య పనులే ఎక్కువగా ఉన్నాయంటూ వారు పాఠశాలలను శుభ్రం చేయడానికి నిరాకరించే వారు. ఎప్పుడో ఓసారి బలవంతంగా వచ్చి పాఠశాల ఆవరణను శుభ్రం చేసే వారు కాని మూత్రశాలలు, మరుగుదొడ్లు శుభ్రం చేసే వారు కాదు. దాంతో ఉపాధ్యాయులు తలాకొంత వేసుకుని స్కావెంజర్‌ను

మిగతా 8వ పేజీలో...

విద్యార్థుల సంఖ్యను బట్టి వేతనం

రాష్ట్రవ్యాప్తంగా స్కావెంజర్లకు నిర్ణీత వేతనం లేదు. విద్యార్థుల సంఖ్యను బట్టి వారి వేతనాలు చెల్లిస్తారు. పాఠశాలలో 1 నుంచి 30 విద్యార్థులు ఉంటే రూ.3వేలు, 31 నుంచి 100 మంది విద్యార్థులకు రూ.6వేలు, 101 నుంచి 250 వరకు రూ.8వేలు, 251 నుంచి 500 మంది విద్యార్థులు ఉంటే రూ.12వేలు, 501 నుంచి 750 మంది విద్యార్థులు ఉంటే రూ.15వేలు చెల్లిస్తారు.





జగదేవ్‌పూర్ రోడ్డుపై ట్రాఫిక్

స్వచ్ఛందంగా నిర్మాణాలు తొలగిస్తున్న స్థానికులు

ఆక్రమణల తొలగింపు ఇక షురూ

- రంగంలోకి అధికారులు
- స్వచ్ఛందంగా తొలగించిన పలువురు స్థానికులు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భువనగిరి పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రహదారులవెంట ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధమైంది. మూడు రోజుల క్రితం వీధి వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆక్రమణలను ఈ నెల 18లోపు తొలగించుకోవాలని అధికారులు విధించిన డెడ్‌లైన్ గురువారంతో ముగిసింది. దీంతో ఆక్రమణల తొలగింపునకు అధికారులు శుక్రవారంనుంచి ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమయ్యారు. ఈమేరకు ఆక్రమణల తొలగింపు పనులకు బందోబస్తు కల్పించాలంటూ మునిసిపల్ అధికారులు డీసీపీ, ఏసీపీ, పట్టణ పోలీసులకు లేఖలు రాశారు. ఇటీవల జరిగిన వరుస రోడ్డు ప్రమాదాలకు కారణమైన జగదేవ్‌పూర్‌చౌరస్తా, ఆ మార్గంలో ఆక్రమణల తొలగింపు, 100 ఫీట్ల రహదారి విస్తరణకు అధికారులు మొదటి ప్రాధాన్యమిస్తున్నట్లు తెలుస్తోంది. మరమ్మతులకు రూ.7కోట్లు మంజూరైన 161 ఏఏ జాతీయ రహదారిపైనే భువనగిరి పట్టణ పరిధిలో జగదేవ్‌పూర్ ఉండటం, ఈ చౌరస్తా విస్తరణకు గతంలోనే రూ.76 లక్షలు కేటాయించడంతో చౌరస్తానుంచి ఆర్‌వోబీ వరకు 100 ఫీట్ల రహదారిగా విస్తరించి ప్రమాదాలను నివారించి ప్రజల ప్రాణాలను కాపాడాలని అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అదే క్రమంలో పట్టణ ప్రధాన రహదారివెంట ఆక్రమణల తొలగింపునకు ప్రజల మద్దతు కూడా లభిస్తుండటంతో ఆ మార్గంలో కూడా ఆక్రమణల తొలగింపునకు ప్రజాప్రతినిధులు, అన్నిస్థాయిల అధికారులు ఏకాభిప్రాయంతో ఉన్నారు. ఈమేరకు పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలకు కారణమవుతున్న తొమ్మిది ప్రాంతాలను గుర్తించి ఆక్రమణలను తొలగించుకోవాలని అధికారులు గడువు విధించిన విషయం విదితమే. ఈక్రమంలో ట్రాఫిక్ పోలీసులు జిల్లా ఆస్పత్రి నుంచి హ్యాండ్లూమ్ మార్కెట్ వరకు రోడ్డుకు ఒకవైపు ఉన్న వీధి వ్యాపారులను తొలగించేందుకు ప్రయత్నాలు చేసి శుక్రవారం నుంచి శాశ్వతంగా మానుకోవాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే జగదేవ్‌పూర్ రోడ్డు వెంట కొంతమంది స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించుకున్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

భువనగిరి గంజ్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ డిమాండ్‌చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని సుందరయ్య భవనంలో జిల్లా అధ్యక్షుడు సురుపంగ ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దివ్యాంగుల పింఛన్‌ను రూ.6వేలకు, వృద్ధులు, వితంతువులతోపాటు చేయూత పింఛన్‌ను రూ.4వేలకు పెంచుతామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి 21 నెలలు గడుస్తున్నా ఎలాంటి హామీలను అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య, బొల్లేపల్లి స్వామి, కొత్త లలిత, బలుగురు అంజయ్య, రంగ సంతోష్, పాండాల శ్రీహరి పాల్గొన్నారు.

రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్‌కు మిల్లర్స్ అసోసియేషన్ వినతి



వినతిపత్రం ఇస్తున్న రైస్ మిల్లర్లు

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ధాన్యం దిగుమతికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జీ.వీరారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆరేళ్లుగా రైస్ పరిశ్రమల సమస్యలు పరిష్కారానికి నోచలేదని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలన్నారు. అదేవిధంగా వ్యవసాయ మార్కెట్ గోదాముల అద్దెను మాఫీచేసి, ఎఫ్‌సీఐ రవాణా చార్జీలు ఇప్పించాలన్నారు. జిల్లాలో సుమారు 44వేల మెట్రిక్ టన్నుల వానాకాలం ధాన్యం, 2.50లక్షల మెట్రిక్ టన్నుల యాసంగి ధాన్యం, నాగిరెడ్డిపల్లి గోదాంలో 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉందన్నారు. తక్కువ డెలివరీ చేయడంతో రైస్‌మిల్లులు నెలలో 10 రోజులు నడిచి మిగతా రోజులు నిర్వహణ భారం అధికమవుతుందన్నారు. దీంతో 2025-26 ఖరీఫ్ ధాన్యం దిగుమతి చేసుకునే అవకాశం లేదని, సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తామన్నారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మార్త వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కోట మల్లారెడ్డి, కోశాధికారి గౌరిశెట్టి అశోక్ పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

యాదగిరిగుట్ట రూరల్, సెప్టెంబరు 18, (ఆంధ్రజ్యోతి): గతంలో భూ భారతి సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) వీరారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దన్నారు. మండలకేంద్రంలో జీపీఎస్ మ్యాపింగ్ పనులను పర్యవేక్షించారు. ఆయన వెంట తహసీల్దార్ గణేష్‌నాయక్, డీటీ సత్యనారాయణ తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

- కలెక్టర్ ఎం.హనుమంతరావు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఎం.హనుమంతరావు తెలిపారు. గురువారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో వచ్చే దరఖాస్తులకు వెంటనే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం విక్రయించేందుకు రామన్నపేట మండలం ఎన్నారం గ్రామంలో ప్రభుత్వ భూమి కేటాయించాలని రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయనవెంట అధికారులు ఉన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలి

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్



సమావేశంలో మాట్లాడుతున్న శ్యాంసుందర్

భువనగిరి రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులకు అందించేలా కృషి చేయాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్ అన్నారు. మండలవ్యాప్తంగా చేపడుతున్న ప్రభుత్వ అభివృద్ధి పథకాల అమలు తీరుపై గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై గ్రామాల వారీగా అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ఎం.దినకర్‌గౌడ్, ఏపీవో గడ్డం బాలస్వామి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులే

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



అయిలమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రంగారెడ్డి

రామన్నపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన తెంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ మునిపంపులలో జరిగింది. ఈ సందర్భంగా అయిలమ్మ చిత్రపటానికి నివాళి అర్పించి, మాట్లాడారు. సాయుధ పోరాటంతో సంబంధంలేని బీజేపీ తెలంగాణ విమోచన పేరుతో ప్రజల్ని మోసం చేస్తుందన్నారు. సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించే బీజేపీని చరిత్ర క్షమించదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై సంఘటితంగా ఉద్యమించాలని పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు అనేక హామీలచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజల్ని మోసం చేస్తున్నాయన్నారు. సభ అనంతరం ప్రజానాట్య మండలి కళాకారుల ఆట పాట ఆకట్టుకున్నాయి. రాళ్లపల్లి జితేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, గడ్డం వెంకటేశం, కల్లూరి నగేష్, జంపాల అండాలు, కందుల హనుమంతు, తొలుపునూరి శ్రీనివాస్, మేకల కృష్ణయ్య, గంటెపాక శివకుమార్, ఈర్లపల్లి ముత్యాలు, జోగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు భేష్

- మహేంద్ర యూనివర్సిటీ విద్యార్థుల కితాబు



మగ్గంపై వస్త్రతయారీని పరిశీలిస్తున్న మహేంద్ర యూనివర్సిటీ విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాలు, వాటి డిజైన్లు భేష్ అని మహేంద్ర యూనివర్సిటీ విద్యార్థుల బృందం కితాబిచ్చింది. హైదరాబాద్ మహేంద్ర యూనివర్సిటీకి చెందిన 25 మంది విద్యార్థుల బృందం గురువారం భూదాన్‌పోచంపల్లి పట్టణాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా వారు భూదాన్‌పోచంపల్లిలోని చేనేత సహకార సంఘం, కళా పునర్వి హ్యాండ్లూమ్ యూనిట్, పోచంపల్లి రూరల్ టూరిజం సెంటర్‌ను సందర్శించారు. పోచంపల్లి గ్రామీణ పర్యాటక మ్యూజియంలోని లీవ్‌టుక్లాత్ ప్రాసెసింగ్ యూనిట్ వారు సందర్శించారు. చేనేత వస్త్ర తయారీ ప్రక్రియలైన గ్రాఫిక్స్, రంగుల అద్దకం, నూలు వడకడం, రీలింగ్, వార్పింగ్, మగ్గాలపై చేనేత పట్టు చీరల తయారీ ప్రక్రియలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ జ్యోతిర్మయిదాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

100 పడకల ఆస్పత్రిగా మార్చాలి

- పీవైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్



ధర్నాలో పాల్గొన్న పీవైఎల్ నాయకులు

ఆలేరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆలేరు పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆస్పత్రిగా మార్చాలని పీవైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్, జిల్లా అధ్యక్షుడు మారుజోడు సిద్ధేశ్వర్ డిమాండ్‌చేశారు. గురువారం పీవైఎల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద చేపట్టిన ధర్నాలో వారు మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా, ఇక్కడ ఆస్పత్రి అభివృద్ధికి నోచుకోలేక పోతుందని, వైద్యంకోసం ఆస్పత్రికి వచ్చే రోగులకు కనీస వసతులు, సరైన మందులు, వైద్య సిబ్బంది లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఇక్కడ ప్రభుత్వ ఆస్పత్రి పరిస్థితిని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు విన్నవించినా స్పందించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఖాళీగా ఉన్న డాక్టర్లు, నర్సులు ఇతర వైద్య సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సాదుల శ్రీకాంత్, ఎలగందుల సిద్ధులు, చికిలం వెంకటేష్, బాలకృష్ణ, వడ్లకొండ నాగరాజు, పగడాల శివ, వీరయ్య, కృష్ణ, ముత్యాలు పాల్గొన్నారు.

సమానత్వం కోసం ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బట్టుపల్లి అనురాధ

భువనగిరి గంజ్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వేచ్ఛ, సమానత్వం కోసం ఉద్యమించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బట్టుపల్లి అనురాధ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని సుందరయ్య భవనంలో(ఐద్వా) అఖిల భారత మహిళ మూడో మహాసభ కల్లూరి నాగమణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, కార్పొరేట్ ప్రయోజనాలకోసం మతోన్మాద విధానాలను వేగవంతం చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరుగ్యారెంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాణి, దాసరి మంజుల, మాటూరి కవిత, గద్దె లత, గంధమల్ల బాలమణి, సింగనబోయిన లావణ్య, వల్లాస్ జంగమ్మ, బందేల అనుసూయ, తాడూరి కలమ్మ, లత, సునీత పాల్గొన్నారు.



బీబీనగర్-పోచంపల్లి మార్గంలో రుద్రవెల్లి లోలెవల్ బ్రిడ్జి పై నుంచి ప్రవహిస్తున్న మూసీ

బీబీనగర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): బీబీనగర్ మండలంలో మూసీకి వరద ఉధృతి పెరిగింది. బుధవారం రాత్రి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. దీంతో వరద నీరంతా మూసీకి వచ్చి చేరుతోంది. గురువారం దిగువనున్న బీబీనగర్ మండల పరిధిలో మూసీకి వరద బాగా పెరిగింది. బీబీనగర్-భూదాన్‌పోచంపల్లి మార్గంలో రుద్రవెల్లి- జూలూరు మధ్యన లోలెవల్ బ్రిడ్జి పైనుంచి నీరు ప్రవహిస్తోంది. అధికారులు, పోలీసులు ఈ మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. సాయంత్రం వరద ఉధృతి తగ్గడంతో యథావిధిగా రాకపోకలు కొనసాగాయి.



తంగడపల్లి చెరువు నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ వెంకటయ్య

తంగడపల్లి చెరువులోకి ప్రవహిస్తున్న వరద

చౌటుప్పల్ టౌన్: చౌటుప్పల్ మునిసిపాలిటీలోని తంగడపల్లి చెరువులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత మూడేళ్లుగా చెరువులోకి వరద నీరు చేరకపోవడంతో సుమారు 600ఎకరాల ఆయకట్టు బీడుగా మారింది. మూడేళ్ల తర్వాత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాచకొండ గుట్టల ప్రాంతంనుంచి ప్రవహిస్తున్న వరద నీరు చెరువులోకి చేరుకుంటోంది. మండల పరిధిలోని ఏనగంటి తండా(రాచకొండ గుట్టల ప్రాంతం) వద్ద నిజాంకాలంలో వరద కాల్వలో నిర్మించిన మత్తడి నుంచి ఒక కాల్వ తంగడపల్లి చెరువులోకి, మరో కాల్వ సంస్థాన్‌నారాయణపురం సమీపంలోని జానకమ్మ చెరువులోకి వరద నీరు ప్రవహించే విధంగా నిర్మించారు. రాచకొండ గుట్టలనుంచి ప్రవహిస్తున్న వరద నీరు ఈ కాల్వల ద్వారా రెండు చెరువుల్లోకి చేరుకుంటుంది.

మత్తడి వద్ద చెట్ల తొలగింపు

మత్తడి వద్ద వరద నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెట్లు, చెత్తా,చెదారాన్ని గురువారం ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య తొలగించే ఏర్పాట్లు చేయించారు. చెరువులోకి ప్రవహిస్తున్న వరద నీటిని చైర్మన్ పరిశీలించారు. భూగర్భజలాలు పెరిగి సాగు, తాగు నీటి సమస్య తీరనుంది.

ఇంకా మూడు రోజులే

- తగ్గిన జీఎస్టీ స్లాబ్‌లు 22 నుంచి అమల్లోకి
- చాలా వస్తువులపై తగ్గనున్న ధరలు
- కొనుగోళ్లకు వినియోగదారుల ఎదురుచూపు

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)

కొత్త జీఎస్టీ స్లాబ్‌లు ఈ నెల 22వ తేదీ నుంచి అమలులోకి రానుండటంతో ఆ రోజు కోసం వినియోగదారులు ఎదురుచూస్తున్నారు. జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి వర్గాలకు ఊరట లభించనుంది. చాలా వస్తువుల ధరలు తగ్గనున్నాయి. దీంతో ప్రస్తుతం నిత్యజీవితంలో అత్యవసరమైన వస్తువులను మాత్రమే ప్రజలు కొనుగోలు చేస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం దాదాపు 391 రకాల వస్తువులపై జీఎస్టీ స్లాబుల్లో మార్పులు చేసింది. నాలుగు స్లాబ్‌లుగా ఉన్న విధానాన్ని రెండుకు తగ్గించారు. ఇప్పటివరకు 5, 12, 18, 28 స్లాబ్‌లుగా ఉండగా వాటిలో 5, 18 స్లాబ్‌లకు కుదించారు. దీంతో ఒక్కో వస్తువుపై దాదాపు 7శాతం నుంచి 11శాతం జీఎస్టీ తగ్గడంతో ధరలు తగ్గి కొనుగోళ్లు పెరుగుతాయని వ్యాపారులు భావిస్తున్నారు. వరుసగా ప్రధాన పండుగలు వస్తుండటం, జీఎస్టీ తగ్గింపుతో విక్రయాల్లో జోరు పెరుగుతుందని వ్యాపారులు భావిస్తున్నారు.

తగ్గిన జీఎస్టీ వసూళ్లు

జీఎస్టీ స్లాబ్‌ల తగ్గింపు ప్రకటనకు ముందు జిల్లాలో ప్రతి రోజూ సుమారుగా రూ.2 కోట్లకు పైగా జీఎస్టీ కింద ప్రభుత్వానికి ఆదాయం వస్తుండేది. ఈ నెల 3వ తేదీన కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటన అనంతరం కొనుగోళ్లు మందగించాయి. అప్పటి నుంచి ప్రతి రోజూ రూ. కోటి నుంచి రూ.1.50 కోట్లకు పన్నుల ఆదాయం తగ్గినట్లు ఓ అధికారి తెలిపారు. ఈ నెల 22 నుంచి కొనుగోళ్లు పెరగడం ద్వారా మరింత పన్ను రాబడి కూడా పెరుగుతుందని పేర్కొంటున్నారు.



కేంద్ర ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం హర్షణీయం. అంతేకాక పూర్తిగా పేద, మధ్యతరగతి వారికి లాభం చేకూర్చేలా మార్పులు, చేర్పులు జరిగాయి. ఇంకా రైతులకు కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు కూడా అమలుచేయాలి.

తాళ్లపల్లి కంట్లం, గోరెంట్ల గ్రామం, మద్దిరాల మండలం



జీఎస్టీ తగ్గింపుతో తగ్గిన వ్యాపారం

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుతో వ్యాపారం తగ్గింది. ఈ నెల 22నుంచి జీఎస్టీ తగ్గింపు అమలులోకి వస్తుందని ప్రకటించడంతో ఎంతోమంది కిరాణ సరుకులు కొనుగోలుకు ముందుకు రావడం లేదు. జీఎస్టీ తగ్గింపు ప్రకటనకు ముందు ప్రతి రోజూ రూ.20వేల నుంచి రూ.25వేల వ్యాపారం నడిచేది. ప్రస్తుతం రూ.15వేల సరుకులు మాత్రమే విక్రయిస్తున్నాం.

శ్రీనివాస్, ప్రభావతి కిరాణం దుకాణం, సూర్యాపేట


కాల్వ మట్టి తరలిస్తున్నా పట్టింపేదీ?

- 69 డీబీఎంను దెబ్బతీసేలా మట్టి తవ్వకాలు
- నీటి విడుదల సమయంలో కోతకు గురయ్యే ప్రమాదం

సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలో ఎస్సారెస్పీ కాల్వ పటిష్టత దెబ్బతినేలా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. వలిగొండ-తొర్రూర్ జాతీయ రహదారి(930పీ) నిర్మాణం కోసం కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా 69 డీబీఎం కాల్వ వెంట తవ్వకాలు చేపట్టారు. ఎటువంటి అనుమతులు తీసుకోకుండా పగలు, రాత్రి సమయాల్లో ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లతో మట్టిని తవ్వి తరలిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-తిరుమలగిరి రూరల్)

వలిగొండ-తొర్రూరు రహదారి కాంట్రాక్టర్లు రోడ్డు నిర్మాణానికి ఎస్సారెస్పీ కాల్వ పక్కన రాజకీయ నాయకులు, అధికారుల అండతో విచ్చలవిడిగా మట్టిని తవ్వి అక్రమంగా రవాణా చేస్తున్నారు. ప్రతిరోజూ రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు భారీ ఎక్స్‌కవేటర్లతో తోడి టిప్పర్లలో మట్టి తరలిస్తున్నారు. 69 డీబీఎం ఎస్సారెస్పీ కాల్వ కింద 67,950ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ క్రమంలో కాల్వ మధ్య నుంచి కుడివైపు 34.9 మీటర్లు, అదేవిధంగా ఎడమ వైపు 37.05 మీటర్లు మొత్తంగా కాల్వ పరిధి 70.98 మీటర్లు ఉండాలి. కానీ చాలాచోట్ల నిబంధనలు బేఖాతరు చేస్తూ చాలామంది కాల్వ కట్టలను ధ్వంసం చేసి భూములను ఆక్రమించారు. 69డీబీఎం పరిధిలోని ప్రధానకాల్వ వెంట చాలా ఎకరాల విస్తీర్ణంలో కాల్వ భూములు ఆక్రమణకు గురైనట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కాల్వల తవ్వకాల సమయంలో ఇరువైపులా పోసిన మట్టికట్టలు రక్షణ గోడలుగా, వర్షాలకు వరదలు రాకుండా ఉండి కాల్వలైనింగ్‌ను కాపాడుతాయి. ఎక్కడైనా కాల్వలకు గండ్లు పడితే అక్కడే ఉన్న మట్టిని పోసి గండ్లు పూడుస్తుంటారు. అంతేకాకుండా కాల్వల పరిధిలోని భూములు ఆక్రమణకు గురికాకుండా మట్టికట్టలు కాపాడుతాయి. ఇన్నివిధాలుగా ఉపయోగం ఉండే మట్టిని ఇటీవలి కాలంలో పూర్తి ధ్వంసం చేస్తూ అక్రమంగా తరలిస్తున్నారు. తిరుమలగిరి మండలంలో ఎస్సారెస్పీ కాల్వలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో యథేచ్ఛగా మట్టి వ్యాపారం సాగుతోంది. మట్టిమాఫియా నిత్యం కాల్వకు ఆనుకుని ఉన్న మట్టికట్టలను తవ్వి తరలిస్తున్నారు. రాత్రీ, పగలు తేడా లేకుండా మట్టి తరలింపు సాగుతోంది.



రాత్రి వేళ ఎక్స్‌కవేటర్లతో టిప్పర్లలోకి మట్టి తరలిస్తున్న దృశ్యం(ఫైల్)

పొంచి ఉన్న ప్రమాదం

కాల్వ పటిష్టతను దెబ్బతీసేలా మట్టి తరలింపుతో ప్రమాదం పొంచి ఉందని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. కాల్వకు నీటి విడుదల సమయంలో మట్టికట్ట దెబ్బతిని ఉండటంతో తెగిపోయే అవకాశం ఉందంటున్నారు. కోతకు గురయ్యే ప్రమాదం ఉందని, ఇలానే కొనసాగితే కాలువల నుంచి చివరి ఆయకట్టు వరకు నీరు వెళ్లడం ఇబ్బందిగా మారుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నీటి పారుదలశాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి కాల్వల హద్దులు గుర్తించి, హద్దురాళ్లు పాతితే కాల్వల ఆక్రమణ, మట్టి తరలింపునకు అడ్డుకట్ట పడుతుందని ప్రజలు భావిస్తున్నారు.

డయల్-100కు ఫోన్ చేస్తేనే...

వెలిశాల గ్రామంలో ఎస్సారెస్పీకాల్వ మట్టిని తవ్వకాలు చేపట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఈ నెల 15న రాత్రి డయల్-100కు ఫోన్ చేశారు. పోలీసులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో డయల్-100ను ఆశ్రయించినట్లు తెలిపారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు తవ్వకాలతో పాటు రవాణాకు వినియోగిస్తున్న వాహనాలను సీజ్ చేశారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు రెండు టిప్పర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి, ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌తో కలిపి ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

ఎటువంటి అనుమతుల్లేవు

కాల్వ పక్కన మట్టిని తరలించేందుకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో వెంటనే స్పందించాం. మట్టి తవ్వకాలపై పోలీసులకు సమాచారం ఇచ్చాం. త్వరలో కాల్వకు హద్దులు నిర్ణయించి, రాళ్లు పాతుతాం. కాల్వల్లో తవ్వకాలపై స్థానికులు సమాచారమిస్తే స్పందిస్తాం

సత్యనారాయణ, ఎస్సారెస్పీ డీఈ

ఆవు కడుపులో 90 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు

- నాలుగు గంటలు శ్రమించి తీసిన పశువైద్యాధికారులు

కోదాడ రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడలో ఆవు కడుపులో 90 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను పశువైద్యాధికారులు తొలగించారు. వివరాల్లోకి వెళితే కోదాడ పట్టణానికి చెందిన ఓ రైతుకు చెందిన 9 ఏళ్ల ఆవు కొద్ది రోజులుగా పొట్ట ఉబ్బి మేతమేయకుండా ఎక్కడ పడితే అక్కడే నిలబడి నీరసంగా ఉంటోంది. గుర్తించిన రైతు ఆవును కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలకు గురువారం తీసుకెళ్లారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పీ పెంటయ్య ఆవుని పరీక్షించారు. ఆవు పరిస్థితి చూసి ఆయన శస్త్రచికిత్సకు సిద్ధమయ్యారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభించిన వైద్యుడికి అసలు సమస్య అర్థమైంది. కొన్నేళ్లుగా ఆవు తింటున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, కేబుల్ వైర్లు, తాళ్లు ఇంకా ఇతర తీగలు పొట్టలో పేరుకుపోయినట్లు గుర్తించారు. వాటిని వివిధ పద్ధతుల్లో బయటకు తీశారు. సుమారు నాలుగు గంటలు శ్రమించి 90 కిలోల వ్యర్థాలను ఆవు కడుపులోంచి బయటకు తీశారు. అదేసమయంలో ఆవు పొట్ట ఖాళీ కావడంతో ఇబ్బంది తలెత్తకుండా కబేళా నుంచి తెప్పించిన శుద్ధమైన మరో పశువు పొట్ట కసరును నింపి ఆపరేషన్‌ను ముగించారు. శస్త్రచికిత్సలో పశువైద్యాధికారులు సురేంద్ర, బీ శ్రీనివాస్, సిబ్బంది చంద్రకళ, సాగర్, అఖిల్, నజీర్ పాల్గొన్నారు.



ఆవు పొట్టలోంచి ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న వైద్యులు

ఆవులకు ప్రమాదం పొంచి ఉంది: పెంటయ్య

ఇష్టానుసారంగా వీధుల్లో వదిలేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలతో కోదాడ పట్టణంలోని ఆవులకు ప్రమాదం పొంచి ఉందని అసిస్టెంట్ డాక్టర్ పీ పెంటయ్య అన్నారు. వీధుల్లో దొరికే ఆహారపదార్థాలతో కలిపి ప్లాస్టిక్ వ్యర్థాలు పశువుల కడుపులోకి వెళ్లి అరగకుండా క్రమంగా పేరుకుపోతాయన్నారు. పశువులను వైద్యశాలకు తీసుకువస్తే అన్నింటికీ శస్త్రచికిత్సలు చేసి వ్యర్థాలను తొలగిస్తామన్నారు.వీధి పశువుల శస్త్రచికిత్సలకు స్వచ్ఛంద సంస్థలు, జంతు ప్రేమికులు ముందుకు రావాలన్నారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ అనంత లోకాలకు

సూర్యాపేట క్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆటోను వెనక నుంచి బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లాకేంద్రంలోని శాంతినగర్ సమీపంలో జరిగింది. పట్టణ ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం పెన్‌పహాడ్ మండలం పొట్లపహాడ్ గ్రామానికి చెందిన ఇరుగు రవీందర్(55) గ్రామంలో ఆర్ఎంపీగా సేవలందిస్తున్నాడు. కాగా బుధవారం ఆత్మకూరు(ఎస్) మండలం ఏనుబాముల గ్రామంలో సమీప బంధువు మరణిస్తే అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళ్లాడు. అనంతరం తిరిగి గ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. పట్టణంలోని శాంతినగర్ సమీపంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ఆటో బ్రేక్ వేయడంతో బైక్‌ను అదుపు చేయలేక వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో రోడ్డుకు బలంగా తలతగలడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంలో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. రవీందర్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ సురేష్ తెలిపారు.



రవీందర్ మృతదేహం

సాగర్‌లో నలుగురికి గాయాలు



ప్రమాదంలో రోడ్డుపై క్షతగాత్రురాలు

నాగార్జునసాగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ సమీపంలో ఆటోను బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై సాగర్ ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం సాగర్ హిల్‌కాలనీ డౌన్ పార్క్ ముత్యాలమ్మ ఆలయం దగ్గర ప్రయాణికులతో పైలాన్‌కాలనీకి వెళ్తున్న ఆటోను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాచర్ల నుంచి వస్తున్న బొలెరో వాహనం వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న బాలునాయక్, మల్లీశ్వరి, విఘ్నేష్‌లతో పాటు ఆటో డ్రైవర్ రవికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ తన సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానిక కలమా నెహ్రూ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు ఢీకొని ఎగిరిపడి ఇద్దరికి..

ఆత్మకూరు(ఎం) సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. ఎస్ఐ హన్మంతు తెలిపిన వివరాల ప్రకారం వలిగొండ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన పారుపల్లి సోములు, అతడి కుమార్తె రాణి కలిసి ద్విచక్రవాహనంపై మోత్కూరుకు వెళ్తున్నారు. ఆత్మకూరు(ఎం) మండలం పోసానికుంట గ్రామానికి చెందిన సామ రవీందర్‌రెడ్డి కారులో హైదరాబాద్ వెళ్తూ ఆత్మకూరు సబ్‌స్టేషన్ సమీపంలో బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సోములు, రాణిలకు దూరంగా ఎగిరిపడటంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

● ఆత్మకూరు (ఎం) మండలం తిమ్మాపురం వద్ద జరిగిన రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇరువురు గాయపడ్డారు. వలిగొండ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన మర్రి ఉపేందర్, తిమ్మాపురం గ్రామానికి చెందిన తోటకూర మల్లయ్యలు ద్విచక్రవాహనాలపై ఎదురుగా తిమ్మాపురం శివారులో ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. మల్లయ్యను 108 వాహనంలో భువనగిరి ఆసుపత్రికి తరలించారు. ఆయా సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హన్మంత్ తెలిపారు.



చికిత్స పొందుతున్న మల్లయ్య

ఉమ్మడి నల్లగొండ స్థాయి
కబడ్డీ పోటీలకు ఎంపిక



వెంకట్

హుజూర్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన వీవీఎం పాఠశాల 10వతరగతి విద్యార్థి వెంకట్ ఉమ్మడి నల్లగొండ జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. రెండు రోజుల కిందట మోతె మండలం నామవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో వెంకట్ ఉత్తమప్రతిభ కనబరిచాడు. అక్టోబరులో నిర్వహించే మూడు జిల్లాల స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వెంకట్‌ను వీవీ మందిర్ ప్రధానోపాధ్యాయురాలు అనితా, పీఈటీ శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు.

చోరీ చేసిన బైక్‌పై వచ్చి చోరీకి యత్నం

భువనగిరి రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం బొమ్మాయిపల్లిలో చోరీకి విఫలయత్నం చేసిన వ్యక్తి చోరీ చేసి తీసుకువచ్చిన ద్విచక్రవాహనాన్ని అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం భువనగిరి మండలం బొమ్మాయిపల్లి గ్రామంలో చోరీ చేసేందుకు ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చాడు. రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి బద్ధ బుచ్చిరెడ్డి ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించి తలుపులను ధ్వంసం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. ఈ క్రమంలో చుట్టుపక్కల అలికిడికి ద్విచక్రవాహనాన్ని అక్కడే వదిలేసి వెళ్లాడు. గురువారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సమీపంలోని సీసీ ఫుటేజ్ రికార్డును పరిశీలించారు. చోరీకి యత్నించిన వ్యక్తి తెచ్చిన ద్విచక్రవాహనం జనగాం జిల్లా రఘునాథ్‌పల్లిలో రెండు రోజుల కిందట చోరీకి గురైనదిగా గుర్తించారు. ఈ మేరకు బైక్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపారు.

ఏటీఎం చోరీకి యత్నం

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏటీఎంలో చోరీకి యత్నించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన షేక్ అబ్దుల్లా బుధవారం అర్ధరాత్రి చౌటుప్పల్ మండలకేంద్రం బస్టాండ్ ఎదురుగా ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఏటీఎం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులను చూసి అబ్దుల్లా పరారవుతుండగా మార్కెట్ యార్డు వద్ద పట్టుకున్నారు. గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నిడమనూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మేతకు వెళ్లిన ఓ పాడిగేదె ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ముకుందాపురం గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన రాం సైదయ్య అనే రైతు తన గేదెలను ఊరు శివారులో సాగర్ ఎడమ కాల్వ పక్కన మేపుతున్నాడు. ఓ గేదె సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు మేతకు వెళ్లింది. ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ తీగలు గేదెకు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని, బాధితుడికి నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్థులు కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రామన్నపేట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండుట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. మూసీ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎన్నారం గ్రామసమీపంలో పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిన్నేటి వాగులో యువకుడు గల్లంతు



ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో



వాగు దాటుతున్న నరేష్ (ప్రమాదానికి ముందు)

బీబీనగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలో కల్వర్టును దాటే క్రమంలో యువకుడు గల్లంతయ్యాడు. ఈ సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా నాచారం ప్రాంతానికి చెందిన గండు నరేష్ భువనగిరి శివారులోని అరోరా ఇంజనీరింగ్ కళాశాలలో మిత్రుడిని కలిసేందుకు ద్విచక్రవాహనంపై వచ్చాడు. అనంతరం ఇద్దరు హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో బీబీనగర్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని సర్వీస్ రోడ్డులో లెవల్ బ్రిడ్జి పైనుంచి చిన్నేటివాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో చూసేందుకు ఆగారు. ఈక్రమంలో వరద నీటి ప్రవాహ దృశ్యాలు తిలకించేందుకు ఇద్దరూ బ్రిడ్జిపై ప్రవహిస్తున్న నీటిలోకి వెళ్లారు. ఓ వృద్ధురాలు వాగును దాటడం గమనించిన నరేష్ తాను కూడా దాటేందుకు ప్రయత్నించాడు. మధ్యలోకి వెళ్లగానే ప్రవాహ తాకిడి అదుపు తప్పి నీటిలోపడి కొట్టుకుపోయాడు. ఇదిలా ఉండగా జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో లెవల్ బ్రిడ్జి మార్గంలో ఓ మృతదేహం కొట్టుకుపోతుండగా చూసిన కొందరు పోలీసులకు సమాచారం అందించారు. దాంతో అప్రమత్తమైన తహసీల్దార్, సీఐ ప్రభాకర్ రెడ్డి ఉన్నతాధికారులకు సమాచారం చేరవేశారు. ప్రమాద విషయం తెలిసి ఆర్డీవో కృష్ణారెడ్డి ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటికే చీకటి పడడంతో గాలింపు చర్యలకు వీలుకాలేదు. దీంతో శుక్రవారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. నీటిప్రవాహాన్ని దాటకుండా అధికారులు రెండు వైపులా కంచె ఏర్పాటుచేసి నిఘా ఏర్పాటుచేశారు.

మూసీ నదిలో మృతదేహం లభ్యం

వలిగొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షానికి కనిపించకుండా పోయిన వ్యక్తి మృతదేహం మూసీనదిలో గురువారం లభ్యమైంది. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ ప్రాంతానికి చెందిన కంబ్లే అర్జున్(21) హైదరాబాద్‌లో ఇటీవల కురిసిన వరదల్లో గల్లంతయ్యాడు. అతడి మృతదేహం వలిగొండ మండలం సంగెం గ్రామపరిధి మూసీ లోలెవల్ బ్రిడ్జి వద్దకు గురువారం కొట్టుకువచ్చింది. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని రామన్నపేట ఏరియాఆస్పత్రికి తరలించారు.అర్జున్ సోదరుడు కరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లాకు చెందిన పైడి నాయుడు(36) చౌటుప్పల్ మండలం లింగోజీగూడెం పరిధిలోని దివీస్ పరిశ్రమలో కొంతకాలంగా పని చేస్తున్నాడు. అంకిరెడ్డిగూడెం గ్రామంలో కుటుంబసభ్యులతో నివాసముంటున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమార్తె తరుచుగా అనారోగ్యానికి గురికావడం, ఇంటి సమస్యలు తీవ్రంకావడంతో ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. దీంతో మనస్తాపానికి గురైన నాయుడు గురువారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు ఆలస్యంగా గమనించడంతో అప్పటికే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ నర్సిరెడ్డి పరిశీలించారు. మృత దేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. భార్య రాజ్యలక్ష్మి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సింగిల్ విండో సొసైటీ తనిఖీ

శాలిగౌరారం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా శాలిగౌరారంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంతో పాటు గోదాములను తహసీల్దార్ షేక్ జమీరుద్దీన్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సొసైటీకి ఇంతవరకు ఎన్ని టన్నుల యూరియా వచ్చింది? ఎంతమంది రైతులకు పంపిణీ చేశారు? వివరాలు తెలుసుకున్నారు. ఎన్ని టన్నుల యూరియా అవసరముందని సొసైటీ సీఈవో నిమ్మల ఆంజనేయులును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏవో సౌమ్య శృతి, సిబ్బంది ఉన్నారు.

తప్పిపోయిన చిన్నారులు క్షేమం



చిన్నారులను పోలీసులకు అప్పగించిన పోలీసులు

తుర్కపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం చోక్లాతండాలో గురువారం ఉదయం తప్పిపోయిన ఇద్దరు చిన్నారులు పోలీసుల సహకారంతో క్షేమంగా తల్లిదండ్రుల వద్దకు చేరారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ మొహరున్నీసా, రహీమొద్దీన్ దంపతులకు చెందిన అబ్దుల్ రెహ్మాన్(మూడేళ్లు), బీహార్ రాష్ట్రానికి చెందిన క్రాంతి దేవి, పప్పు సుహాని కుమార్తె ప్రీతికుమారి(మూడేళ్లు) బస్వాపూర్ రిజర్వాయర్ పనుల కోసం వచ్చి చోక్లాతండాలో మూడు నెలలుగా ఉంటున్నారు. చోక్లాతండా నుంచి నిత్యం బస్వాపూర్ వెళ్లి పనులు నిర్వహిస్తున్నారు. కాగా ఉదయం తినుబండారాల కోసం గ్రామంలోని కిరాణ దుకాణానికి వెళ్లిన ఇద్దరు చిన్నారులు కనిపించలేదు దీంతో తల్లిదండ్రులు సమీప ప్రాంతాల్లో వెతికారు. అయినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో తుర్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఎస్ఐ తకీమొద్దీన్‌గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు.యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాసనాయుడు పర్యవేక్షణలో సీఐ శంకర్‌గౌడ్, ఎస్ఐ, సిబ్బందితో కలసి గాలింపు చేపట్టారు. కాగా మధ్యాహ్నం భువనగిరి మండలం వడపర్తి గ్రామసమీపంలో పిల్లలు ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు అక్కడకు చేరుకుని తప్పిపోయిన పిల్లలను గుర్తించారు. చిన్నారులను తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. తప్పిపోయిన పిల్లల ఆచూకీ ఐదు గంటల్లోనే తెలుసుకుని కేసును ఛేదించిన పోలీసులకు చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

తప్పుడు రిపోర్ట్ ఇచ్చారని ఆందోళన



మాల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాలుడి తల్లిదండ్రులు

చింతపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బాలుడికి జ్వరం రావడంతో వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి వస్తే పరీక్ష చేసి తప్పుడు రిపోర్ట్ ఇచ్చారని బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కుల్‌కులపల్లి గ్రామానికి చెందిన శవ్వ మహేష్, మహేశ్వరి దంపతుల రెండేళ్ల కుమారుడు శ్రీహన్స్‌కు జ్వరం రావడంతో చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్(మాల్)లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం తీసుకువచ్చారు. వైద్యుడు శ్రీహన్స్‌కి వైద్య పరీక్షల కోసం డయాగ్నస్టిక్‌కు సూచించారు. తల్లిదండ్రులు మాల్‌లోని ఓ ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్‌లో బాలుడి రక్త నమూనాను పరీక్ష కోసం ఇచ్చారు. నిర్వాహకుడు పరీక్ష చేసి బాలుడికి డెంగీ పాజిటివ్ రిపోర్ట్‌ను తల్లిదండ్రులకు ఇవ్వడంతో వారు వైద్యుడిని సంప్రదించారు. దీంతో మూడు రోజుల వరకు బాలుడికి చికిత్స అందిస్తానని చెప్పినట్లు వారు తెలిపారు. వారు శ్రీహన్స్ రక్తపరీక్ష కోసం ఇతర కేంద్రంలో ఇవ్వడంతో పరీక్ష చేసి డెంగీ నెగిటివ్ రిపోర్ట్ పత్రాన్ని అందించారు. దీంతో తల్లిదండ్రులు ఆస్పత్రి వద్దకు చేరుకొని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని ఆందోళన చేశారు. వైద్యుడితో పాటు స్థానికులు నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు.

యూరియా కొరత సమస్యను పరిష్కరించాలి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరతను నివారించాలని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు బస్తా యూరియా రూ.266కే అందించాలన్నారు. బ్లాక్ మార్కెట్లో, రైతులకు అధిక ధరలకు విక్రయించే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేకుండా నిరంతరం అవసరమైన యూరియాను తెప్పించి అధికారుల పర్యవేక్షణలో పంపిణీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. నెల రోజులుగా రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుండా నవీన్‌రెడ్డి, బోగరి అనిల్ కుమార్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మంగిలిపల్లి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీలకు కబడ్డీ జట్టు ఎంపిక



కబడ్డీ జట్టుకు ఎంపికైన విద్యార్థులతో ఎన్జీ కళాశాల అధ్యాపక బృందం

నల్లగొండ టౌన్, కోదాడటౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నల్లగొండ ఎన్జీ కళాశాల, సూర్యాపేట జిల్లా కోదాడలోని కేఆర్ఆర్ కళాశాల విద్యార్థులు సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 17న ఎంజీయూలో యూనివర్సిటీ కబడ్డీ జట్టును ఎంపిక చేశారు. ఎన్జీ కళాశాలకు చెందిన కె. రాకేష్, ఎం. నాగరాజు, బి. బ్రహ్మ, కే. అనిల్, కే. సంపత్, కేఆర్ఆర్ కళాశాలకు చెందిన అజిత్, నవీన్, డి. అనిల్, ఎం. గురమూర్తి, నాగరాజు ఎంపికయ్యారు. అదేవిధంగా కేఆర్ఆర్ కళాశాలకు చెందిన జి. శ్రీజా మహిళా కబడ్డీ జట్టుకు ఎంపికైంది. అక్టోబరు 4వ తేదీ నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బెహల్గాంలో నిర్వహించే సౌత్‌జోన్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని ఎన్జీ, కేఆర్ఆర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు సముద్రాల ఉపేందర్, హదస రాణి తెలిపారు. విద్యార్థులను ఎన్జీ కళాశాల ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ మల్లేశం, వైస్ ప్రిన్సిపాల్ పరంగి రవికుమార్ పరీక్షల నియంత్రణ అధికారి బి. నాగరాజు, ఆఫీసు సూపరిండెంటెంట్ కోటేశ్వరరావు, కేఆర్ఆర్ కళాశాల పీడీపీ ఫ్రాన్సిస్, వైస్ ప్రిన్సిపాల్ చందా అప్పారావు, కబడ్డీ కోచ్ నామా నరసింహారావు, అధ్యాపకులు సైదిరెడ్డి, ఎస్ఎమ్ రఫీ తదితరులు అభినందించారు.

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

నల్లగొండ స్పోర్ట్స్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ క్రీడా జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 20 తేదీన విపస్య పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండారు ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి ఎంపికైన క్రీడా జట్లు ఈ నెల 25నుంచి 28వ తేదీ వరకు మహబూబ్ నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కు పంపనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలతో హాజరుకావాలని కోరారు.

మత ఛాందసవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ నాయకురాలు అనసూర్య

సూర్యాపేటఅర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మహిళలు మత ఛాందస వాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి. అనసూర్య పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞానకేంద్రంలో గురువారం నిర్వహించిన సంఘం రాజకీయ శిక్షణ తరగతుల్లో మాట్లాడారు. కుల, మత చాందసవాదంతో మనుషుల మధ్య అంతరాలు సృష్టిస్తున్నారన్నారు. సంఘం నిరంతరం మహిళలను చైతన్యవంతం చేయడానికి సదస్సులు, చర్చలను, శిక్షణ తరగతులు నిర్వహిస్తుందన్నారు. మహిళలు అనేక రంగాల్లో ఆర్థిక, రాజకీయ, లైంగిక దోపిడీకి గురవుతున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు మేకల రాజేశ్వరీ, మాధవి, కార్యదర్శి నర్సమ్మ, సీత, వాణిశ్రీ, రామలింగమ్మ, మంగమ్మ, సైదమ్మ పాల్గొన్నారు.

మహాత్మాగాంధీకి గుడి నిర్మించడం అద్భుతం



పూజలో పాల్గొన్న పీటర్ విస్

చిట్యాలరూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీకి గుడి నిర్మించడం అద్భుతమని యూరోపియన్ కమిషన్(అమెరికా) పీటర్ విస్ అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారు గాంధీగుడిని గురువారం సందర్శించారు. గర్భగుడి చుట్టూ ఉన్న పవిత్ర పుణ్యక్షేత్రాల మట్టి, పవిత్రమైన గ్రంథాల గురించి పురోహితుడు ఆయనకు వివరించారు. దేశ స్వాతంత్ర్యం కోసం యావత్ దేశ ప్రజలను స్వాతంత్రోద్యంలో పాల్గొనేలా చేసి ఉద్యమాన్ని నడిపించిన మహానుభావుడు మహాత్మాగాంధీ అని కొనియాడారు. మహాత్ముడిగా కొలుస్తూ గాంధీకి గుడిని నిర్మించడం భగవంతుడిగా కొలుస్తూ గర్భగుడిలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గాంధీపై ఉన్న మమకారానికి నిదర్శనమన్నారు. అహింసా పద్ధతిలో స్వాతంత్ర్యాన్ని సాధించిన గాంధీకి గుడి నిర్మించిన వారిని అభినందించారు.

విత్తన కష్టాలు తీరేలా..

● రైతుస్థాయిలో వరి విత్తోనోత్పత్తి ● తక్కువ ఖర్చుతో నాణ్యమైన విత్తనాలు ● యువ రైతులకు కేవీకేలో శిక్షణ



పంటకు మూలం విత్తనం. దిగుబడులపై ప్రభావం చూపే అంశాల్లో ప్రధానమైనది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు వరి సాగుకు ప్రసిద్ధి. రాష్ట్రంలోనే ఇక్కడ అత్యధికంగా సాగు చేస్తారు. ఏడు దశాబ్దాలుగా వరి సాగు జరుగుతున్నా విత్తోనోత్పత్తిపై రైతులకు అవగాహన ఉండడంలేదు. ప్రతి సీజన్‌లో వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. రైతు స్థాయిలో వరి విత్తనాలు తయారు చేసుకుంటే ఖర్చు తక్కువతో పాటు నాణ్యమైన విత్తనాలు పొందవచ్చు. రైతులు తమ పంట పొలాల్లో సొంతంగా విత్తనాలు తయారు చేసుకునే పద్ధతిని నల్లగొండ జిల్లా త్రిపురారం కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ వివరించారు.

● ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ, వ్యవసాయం.

విత్తనానికి ప్రధానంగా మొలక శాతం. అధిక జన్యు స్వచ్ఛత, తక్కువ జడ పదార్థం, తక్కువ సంఖ్యలో కలుపు, తెగుళ్లను సమర్థవంతంగా తట్టుకునే విత్తనం..అటు వంటి విత్తనాన్ని రైతులు తమ పొలంలోనే విత్తోనోత్పత్తి చేసుకోవాల్సిన అవసరముంది. ధ్రువీకరించిన విత్తనం కొనుగోలు చేసి రైతు స్థాయిలోనే తక్కువ ఖర్చుతో నాణ్యమైన విత్తనాన్ని తయారు చేసుకోవచ్చు. ఒకే విత్తనం కొంతం కాలం సాగు చేసిన తరువాత దిగుబడి తగ్గుతుందనే అపోహ రైతుల్లో ఉంది. అది యాంత్రిక కల్తీ వల్ల ఆశించే తెగుళ్ల ప్రభావం ఉంటుంది.

విత్తనోత్పత్తిలో ప్రధాన అంశం పంటలో బెరుకులను తీయడం. ఇది మూడు పద్ధతిల్లో చేపట్టాలి,

- పైరు దుబ్బు చేసే సమయం. ● పూత దశ
- గింజగట్టిపడినపుడు (వరి కోత ముందు)

దుబ్బు చూసే సమయం

సాగు చేసిన రకం భౌతిక లక్షణాలు అనుసరించి అంటే పైరు ఎత్తు, ఆకు రంగు, దుబ్బు చేసే గుణం మొదలగు లక్షణాలకు భిన్నంగా, పొట్టిగా లేదా పొడుగుగా, ఆకురంగులో మార్పు, భౌతికంగా వేరుగా



అండే మొక్కలకు పూర్తిగా వేర్లతో తీసివేయాలి.

పూత దశ

ముందుగా పూతకు వచ్చినవి లేదా ఆలస్యంగా పూతకు వచ్చేవి. పోటాకు అమరికలో వ్యత్యాసమున్న మొక్కలు పూర్తిగా తీసి వేయాలి.

విత్తనం నిల్వలో జాగ్రత్తలు

- వరి కోత కోసినపుడు, నూర్పిడి సమయాల్లో యాంత్రిక కల్తీ అనగా యంత్రాలు, మనుషులు, పనిముట్లు, ద్వారా ఇతర రకాల గింజలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నూర్పిడి యంత్రాల ద్వారా విత్తన కల్తీ జరుగుతుంది. ఎలాంటి పరిస్థితుల్లో విత్తనోత్పత్తి నేలల్లో యంత్రాలు వాడకూడదు.
- విత్తనాన్ని ఎండ బెట్టేటపుడు తేమ 13శాతం చేరుకునే వరకు బాగా ఎండలో ఎండ బెట్టాలి. కల్లాల్లో కల్తీ లేకుండా చూసుకోవాలి.
- విత్తన నిల్వకు బాగా శుభ్రం చేసిన గోనె సంచులను లేదా కొత్త సంచులను మాత్రమే ఉపయోగించాలి. అధిక తేమ శాతం, అధిక ఉష్ణోగ్రతకు గురి కాని, గాలి, వెలుతురు బాగా తగిలే ప్రదేశాల్లో నిల్వ చేయాలి.
- విత్తనాన్ని గాదెల్లో, పాతరల్లో గాని లేదా ఎరువుల సంచుల్లో నిల్వ ఉంచొద్దు. విత్తనం నిల్వ ఉన్న చోట రసాయనికి ఎరువులు, పురుగు మందులు గాని ఉంచవద్దు.

విత్తనోత్పత్తి గ్రామస్థాయిలో లేదా ఒక రైతు సహకార సంస్థ స్థాయిలో చే సేటపుడు ఒక ప్రాంత రైతులు తమకు కావాల్సిన విత్తనాన్ని ఒకే రకానికి చెందినదై ఉండే విత్తనాన్ని ఉత్పత్తి చేయడం మంచిది.

యువ రైతులకు ప్రత్యేక శిక్షణ

● వరి విత్తనోత్పత్తిపై ఆసక్తి ఉన్న యువ రైతులకు కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. వివరాల కోసం సెల్: 9848430317లో సంప్రదించవచ్చు.

నాణ్యమైన విత్తనం కోసం..



- వాతావరణ పరిస్థితులు, కాలపరిమితిని అనుసరించి అనువైన రకాలు సాగు చేసుకోవాలి.
- విత్తనోత్పత్తి సారవంతమైన, మంచి నీటి వసతి ఉన్న పొలాల్లోనే చేపట్టక పోతే విత్తన నాణ్యత దెబ్బతింటుంది.
- విత్తనోత్పత్తి అంతకు ముందు పంట కాలంలో అదే రకం వేసిన పొలంలో లేదా వేరే పంట వేసిన పొలం సాగు చేసినా స్వయం ఉత్పత్తి మొలకల వలన కల్తీ జరగకుండా జాగ్రత్త పడవచ్చు.
- విత్తనోత్పత్తి చేసే పొలం చుట్టు అదే పంటకి చెందిన వేరే రకం ఉంటే కనీసం 3 మీటర్ల దూరం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- నారుమడిని పోసినపుడు నేలను బాగా దున్ని కలుపు లేకుండా చేసి నారు పెట్టడానికి తీయడానికి వీలుగా కాల్వలు ఏర్పాటు చేయాలి.
- నారుమడిలో పశువుల ఎరువు, పచ్చిరొట్ట పెంచి కలియదున్నాలి. నత్రజని సగ భాగం, మొత్తం భాస్వరం పొటాష్ వేసిన తర్వాత రెండో భాగం నత్రజనిని విత్తిన 12-15 రోజుల మధ్య వేసుకోవాలి.
- నాట్లు వేసేటపుడు 25-30 రోజుల వయస్సు గల నారును రకాల కాల పరిమితిని అనుసరించి నాటాలి.
- కుదురుకు 2-3 మొక్కల చొప్పున పైన నాటాలి. దీర్ఘకాలిక రకాలైతే చ.మీ.కి 33 కుదుళ్ల స్వల్ప కాలిక రకాలను 44 కుదుళ్ల ఉండేలా చూడాలి.
- కలుపు నివారణకు నాటిన 3-5 రోజుల వ్యవధిలో ప్రిటలాక్లోర్ 500 మి.లీ లేదా అక్సాడయార్జిల్ 35గ్రాములు ఎకరానికి 20 కిలోల ఇసుకలో కలిపి పొలం అంతా సమానంగా చల్లుకోవాలి. కలుపు మందు వేసిన తరువాత 2-3 రోజుల వరకు నాటిన చేలో నీటిని నిల్వగట్టాలి,
- భూసారం పరీక్షననుసరించి సిఫార్సు మేరకు ఎరువులు వేయాలి. భాస్వరం సంబంధించిన కాంప్లెక్స్ ఎరువులు పై పాటుగా వేయవద్దు.
- విత్తిన పంటకు మామూలు వాణిజ్య పంట లాగ నీటి యాజమా న్యం పాటించాలి. కీలక దశలైన అంకురం ఏర్పడుట, పూత దశ, గింజ పాలుపోసుకుని, గింజ గట్టిపడే దశలో నీటి ఎద్దడికి గురి కాకుండా చూసుకోవాలి.

నాణ్యాతా ప్రమాణాలు (శాతాల్లో)

జన్యు స్వచ్ఛత -98
భౌతిక స్వచ్ఛత - 98
జడ పదార్థం - 2
మొలక శాతం - (80)
తేమ శాతం - 13
పై పొట్టు లేని గింజలు -2

శాస్త్రోక్తంగా నిత్య పూజలు



తిరువీధుల్లో స్వామిఅమ్మవారి జోడు సేవల ఊరేగింపు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.21,83,124ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. కాగా, ఈ నెల 22న స్వామివారి హుండీ లెక్కింపు కొండకింద వ్రత మండపంలో నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

ఫ్లెక్సీలను తొలగించాలి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి కొండకింద వైకుంఠద్వారం చెంత ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని పట్టణానికి చెందిన యువకులు కోరారు. కొండపైన గురువారం దేవస్థానం ఏఈవో జూశెట్టి క్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. వైకుంఠద్వారం చెంత అన్యమత ప్రచారం, రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు ఆంజనేయస్వామి సర్కిల్ వద్ద వెలుస్తున్నాయని పేర్కొన్నారు. యథేచ్ఛగా వెలిసిన ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. వైకుంఠద్వారం కూడలి వద్ద ఫ్లెక్సీలు నిరోధించేందుకు ఆలయ అధికారులు చర్యలు చేపట్టి ఆలయ పవిత్రను కాపాడాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బండి అనిల్, దండ బోయిన వెంకటేశ్, బూడిద మచ్చేందర్, ఆలేటీ కర్ణ, పులేపాక అంబేడ్కర్, చిగురుపల్లి నరేష్, సుదగాని ప్రహ్లాద తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌ను సందర్శించిన కేఆర్ఎంబీ చైర్మన్



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో చీపురు పట్టి ఊడుస్తున్న కేఆర్ఎంబీ చైర్మన్ పాండ్యే

నాగార్జునసాగర్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కృష్ణారివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(కేఆర్ఎంబీ) చైర్మన్ బీపీ. పాండ్యే గురువారం నాగార్జునసాగర్ సందర్శనకు వచ్చారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన బుధవారం రాత్రి సాగర్‌కు చేరుకున్నారు. గురువారం ఉదయం పర్యాటక శాఖ లాంచీలో నాగార్జునకొండకు వెళ్లారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సాగర్ ప్రధాన డ్యాం, ఎడమ ఎర్త్ డ్యాం, పైలాన్ ఫిల్లర్ వద్ద చీపురు పట్టి ఊడ్చారు. అనంతరం సాగర్ ప్రధాన డ్యాం, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం, గ్యాలరీలు, ఎడమ కాల్వ జలవిద్యుత్ కేంద్రాలను పరిశీలించారు. జల విద్యుత్ కేంద్రాల్లో నీటి వినియోగం గురించి జెన్‌కో, ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం బుద్ధవనం ప్రాజెక్టును సందర్శించారు. బుద్ధవనంలో స్థూపవనం, జాతక వనం, చరిత వనం, ధ్యాన వనం, మహాస్థూపాలను తిలకించారు. శుక్రవారం ఉదయం పులిచింతల ప్రాజెక్టును సందర్శించనున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. అక్కడ నుంచి తిరిగి హైదరాబాద్‌కు వెళ్తారని తెలిపారు. ఆయన వెంట ప్రాజెక్టు సీఈ అజయ్‌కుమార్, కేఆర్ఎంబీ సభ్యుడు కేకే జంగిద్, ఈఈ సీతారాం, డీఎస్ఈ నాగేశ్వర్‌రావు, ఇంజనీర్లు కృష్ణయ్య, సత్యనారాయణ, జెన్‌కో ఎస్పీఎఫ్ ఆర్ఐ ప్రతాప్‌నాయుడు తదితరులు ఉన్నారు.

క్రీడలు ఐకమత్యం పెంచుతాయి



మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముస్తాక్ అహ్మద్

నల్లగొండ స్పోర్ట్స్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): క్రీడలు విద్యార్థుల్లో ఐకమత్యాన్ని పెంచుతాయని నల్లగొండ మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముస్తాక్ అహ్మద్ అన్నారు. ఎస్‌జీఎఫ్ నల్లగొండ నియోజక వర్గస్థాయి క్రీడా పోటీలు గురువారం జిల్లాకేంద్రంలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి జూనియర్ కళాశాల మైదానంలో ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే ఆసక్తి ఉన్న ఆటలో తర్ఫీదు పొంది రాణించాలన్నారు. అనంతరం నల్లగొండ, కనగల్, తిప్పర్తి మండలాలకు చెందిన అండర్ -14, 17 బాల, బాలిలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. సుమారు 400 మంది బాల, బాలికలు పాల్గొన్నారు. ప్రతిభకనబర్చిన క్రీడాకారులకు జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎఈవో కత్తుల అరుంధతి, ప్రతీక్‌రెడ్డి కళాశాల ట్రస్ట్ సీఈవో గోనారెడ్డి, ఎమ్మార్వో పరుశరాం, ఎంపీడీవో యాకూబ్, దగ్గుబాటి విమల, ఎంఈవోలు పద్మ, నరసింహ నాయక్, రాజు, రాంమోహన్, ఫయాజ్, కుంభం నర్సిరెడ్డి పాల్గొన్నారు.

నిడమనూరు ఏవో సస్పెన్షన్

నిడమనూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండల వ్యవసాయాధికారి(ఏవో) ముని కృష్ణయ్యను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం, స్థానికంగా ఉండకపోవడం, యూరియా పంపిణీలో వైఫల్యం చెందడం వంటి కారణాలతో సస్పెన్షన్‌కు గురయ్యారు. ఐదు రోజులుగా సొసైటీలు, రైతువేదికల ద్వారా యూరియా సరఫరా కాకపోవడంతో ఆగ్రహించిన రైతులు గురువారం నిడమనూరు మండల కేంద్రంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై ఉదయమే రెండు గంటల పాటు ఆందోళనచేశారు. తమకు సక్రమంగా యూరియా సరఫరా కావడం లేదంటూ నిరసనకు దిగారు. ఆ సమయంలో రైతులకు నచ్చజెప్పేందుకు అక్కడకు వ్యవసాయాధికారి రాలేదు. స్థానికంగా వ్యవసాయాధికారి అందుబాటులో లేరని ఫిర్యాదు రావడంతో ఆయనను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

పనులు వదిలి.. యూరియా కోసం వెళ్లి



నిడమనూరులో రాస్తారోకో చేస్తున్న రైతులు

వ్యవసాయ పనులు వదిలి రాత్రనక, పగలనక రోజుల తరబడి సింగిల్‌విండోలు, ఎరువుల దుకాణాల చుట్టూ తిరుగుతున్నా రైతులకు యూరియా దొరకడం లేదు. ఉదయం క్యూలో నిల్చుంటే సాయంత్రం వరకూ ఒక్క బస్తా కూడా అందడం గగనమవుతోంది. దీంతో ఆగ్రహిస్తున్న అన్నదాతలు పీఏసీఎస్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేస్తున్నారు. తమకు సకాలంలో యూరియా అందించడం లేదని రాస్తారోకో చేస్తున్నారు.

నిడమనూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండలకేంద్రంలోని కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై గురువారం రైతులు రాస్తారోకో చేశారు. ఐదు రోజులుగా యూరియా లోడు రాకపోవడంతో గురువారం వస్తుందని ఆశతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు తెల్లవారుజామునే పెద్ద ఎత్తున సొసైటీ వద్దకు వచ్చారు. యూరియా లోడు రావడం లేదని లేదని తెలియడంతో ఆగ్రహించి జాతీయ రహదారిపై బైఠాయించారు. రెండు గంటల పాటు ఆందోళన చేశారు. సొసైటీలు, రైతువేదికలకు ఇవ్వ కుండా యూరియాను ప్రైవేట్ డీలర్లకు కేటాయించడం ఏమిటని నిలదీశారు. రాస్తారోకోతో సుమారు రెండు కిలోమీటర్ల మేరకు వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న హాలియా ఏడీఏ సరిత, ఎస్ఐ సాయి ప్రశాంత్ వచ్చి రైతులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేయించారు.

దామరచర్ల: సకాలంలో యూరియా అందించడం లేదని ఆగ్రహించిన రైతులు నల్లగొండ నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలోని అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై రాస్తారోకో చేశారు. రేయింబవళ్లు పీఏసీఎస్ కేంద్రాల చుట్టు తిరుగుతూ గంటల తరబడి యూరియా కోసం క్యూలైన్‌లో నిల్చొన్నా ఒక్క బస్తా యూరియా దొరకడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మొదటి విడత యూరియా చల్లకపోవడంతో వరి పంటకు పిలకలు రావడం లేదని, దిగుబడి తగ్గే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. రూరల్ సీఐ పీఎన్‌డీ.ప్రసాద్ అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి ప్రతి రైతుకు రెండు బస్తాల యూరియాను అందిస్తానని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు.

మేళ్లచెర్వు: సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలంలోని కందిబండ పీఏసీఎస్ వద్ద మేళ్లచెర్వు-కోదాడ రహదారిపై రైతులు గురువారం రాస్తారోకో చేశారు. కందిబండలోని పీఏసీఎస్‌కు యూరియా కట్టలు వచ్చాయని సమాచారంతో వేకుజామునుంచే రైతులు క్యూలైన్‌లో ఉన్నారు. వచ్చిన 240 యూరియా బస్తాలు కొంతమంది రావడంతో మిగిలిన రైతులు తీవ్ర ఆగ్రహంతో రాస్తారోకో చేశారు. క్యూలైన్లో వేచి ఉన్న రైతులకు రేపు వచ్చేలారీలో యూరియా ఇస్తామని పోలీసులు సర్ది చెప్పడంతో రాస్తారోకో విరమించారు.

యూరియా కోసం పాట్లు

తుంగతుర్తి: యూరియా కోసం రైతులు పాట్లు పడుతున్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలకేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రానికి గురువారం 880 బస్తాల యూరియా వచ్చింది, రైతులు యూరియా కోసం రాత్రి 10 గంటల నుంచే పీఏసీఎస్ వద్దే క్యూ కట్టారు. రోజుల తరబడి తిరుగుతున్నా ఒక్క బస్తా కూడా దొరకడం లేదని రైతులు వాపోయారు. తాము ఇళ్లకు వెళ్లిన తర్వాత రాత్రి టోకెన్లు ఇస్తున్నారని రైతులు అంటున్నారు.

క్యూలైన్‌లో చెప్పులు

అడ్డగూడూరు: అడ్డగూడూరు మండలంలో యూరియా కోసం రైతుల ఆందోళన కొనసాగుతునే ఉంది. గురువారం అడ్డగూడూరు సింగిల్ విండోకు యూరియా రావడంతో రైతులు తెల్లవారుజామునే భారీగా వచ్చి చెప్పులతో క్యూలైన్‌లో పెట్టారు. ఒక్కో పాసు పాస్‌పుస్తకానికి రెండు బస్తాల చొప్పున అధికారులు యూరియా పంపిణీ చేశారు.

మద్దిరాలలో రైతుల బారులు

మద్దిరాల: యూరియా కోసం సూర్యాపేట జిల్లా మద్దిరాల మండల కేంద్రంలోని అగ్రోస్, ఎన్‌డీసీసీ కేంద్రాల వద్ద రైతులు బారులు తీరారు. వచ్చిన యూరియా కూడా పోలీసుల పహారాలో పంపిణీ చేస్తున్నారు. గురువారం మండలానికి 440బస్తాల యూరియా రాగా 600మంది రైతులు వచ్చారు. ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

శాలిగౌరారం : నల్లగొండ జిల్లా శాలిగౌరారంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రానికి గురువారం 444 బస్తాలు, సాయినాథ్ ఫర్టిలైజర్ దుకాణానికి 444 బస్తాలు, పెర్కకొండారంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రానికి 444 యూరియా బస్తాలు వచ్చాయి. గురువారం తెల్లవారుజాము నుంచే రైతులు పెద్ద ఎత్తున వచ్చి చెప్పులు, రాళ్లను పెట్టి బారులు తీశారు. పోలీస్‌స్టేషన్‌లో టోకెన్ విధానం పెట్టడంతో అక్కడ కూడా పెద్ద ఎత్తున రైతులు బారలు తీశారు. శాలిగౌరారం మండల వ్యవసాయ అధికారిణి సౌమ్య శృతి తన సిబ్బందితో టోకెన్ ద్వారా రైతుకు ఒక్కొక్క బస్తా చొప్పున పంపిణీ చేశారు.

మర్రిగూడ: నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సొసైటీ కేంద్రానికి యూరియా వచ్చిందని తెలుసుకున్న మండలంలోని పలు గ్రామాల రైతులు తెల్లవారుజాము నుంచే నిరీక్షించారు. 420యూరియా బస్తాల లోడ్ రాగా, 750 మంది రైతులు వచ్చారు. 420 మంది రైతులకు ఒక్కో బస్తా చొప్పున పంపిణీ చేశారు.

మోత్కూరు: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు సింగిల్ విండోకు గురువారం 444 బస్తాల యూరియా వచ్చింది. మోత్కూరుతో పాటు మండలంలోని పలు గ్రామాల రైతులు భారీ సంఖ్యలో అక్కడకు చేరుకుని లైన్‌లో నిల్చున్నారు. గత శనివారం యూరియా కోసం వచ్చి లైన్ ఉన్నా దొరకని రైతులకు ఆరోజు టోకెన్లు ఇచ్చి పంపారు. ఈ రోజు మొదట శనివారం టోకెన్లు ఇచ్చిన రైతులకు రెండు బస్తాలు ఇచ్చారు.



అడ్డగూడూరు పీఏసీఎస్ క్రేంద్రం వద్ద బారులు తీరిన రైతులు

కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా ప్రవీణ్

బొమ్మలరామారం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బొమ్మలరామారం గ్రామశాఖ అధ్యక్షుడిగా సాదుల ప్రవీణ్‌ను ఆ పార్టీ కార్యకర్తలు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భవనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్ పైలెట్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ప్రవీణ్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. నాయకులు భగవంతురెడ్డి, రాంపల్లి మహేష్‌గౌడ్, పండుగరాజు పాల్గొన్నారు.

ఏసీపీ రాహుల్‌రెడ్డికి అదనపు ఎస్పీగా ఉద్యోగోన్నతి



భువనగిరి టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భువనగిరి ఏసీపీ కె.రాహుల్‌రెడ్డికి అదనపు ఎస్పీగా పదోన్నతి లభించింది. దనపు ఎస్పీగా ఉద్యోగోన్నతి లభించిన ఆయన అదే హోదాతో భువనగిరి ఏసీపీగానే కొనసాగుతున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నెడితే కానీ కదలని ట్రాక్టర్లు

- ఇలా అయితే చెత్త సేకరణ ఎలా?
- నాలుగింటికి 3 వాహనాల పరిస్థితి ఇదే..

భువనగిరి టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వంద రోజుల ప్రణాళిక పేరిట భువనగిరి మునిసిపల్ అధికారులు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. పట్టణంలోని ప్రతి బస్తీని జల్లెడ పట్టి శుభ్రం చేశామని, భారీ మొత్తంలో ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, అండర్ అసైన్డ్ భవనాలను గుర్తించి కొలతలు వేసి ఆస్తిపన్ను ఆదాయాన్ని పెంచామని చెబుతున్నారు. కానీ నాణానికి మరోవైపు మాత్రం నెట్టితేనే స్టార్ట్ అయ్యే ట్రాక్టర్లు, రోజులపాటు మరమ్మత్తుల పేరిట ఖార్ఖానాలకే పరిమితమైన చెత్త సేకరణ ఆటో ట్రాలీలు, మునిసిపల్ శానిటేషన్ విభాగంలో నాలుగు ట్రాక్టర్లు, 18 చెత్త సేకరణ ఆటో ట్రాలీలు ఉన్నాయి. ఆటో ట్రాలీల ద్వారా పట్టణంలో ఇంటింటా రహదారుల వెంట పొగయ్యే చెత్తను ట్రాక్టర్ల ద్వారా సేకరిస్తూ డంపింగ్‌యార్డ్‌కు తరలిస్తుంటారు. ప్రతీ రోజు సుమారుగా 30 మెట్రిక్‌టన్నుల చెత్తను తరలిస్తారు. దీంతో వాహనాల నిర్వహణ పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అధికారులు అందుకు భిన్న వైఖరి ప్రదర్శిస్తున్నట్టు తెలుస్తోంది. ఫలితంగా నాలుగు చెత్త సేకరణ ట్రాక్టర్లు మూడు ట్రాక్టర్లకు సెల్ఫ్ లేకపోవడంతో ట్రాక్టర్ ఆగిన ప్రతీసారి పారిశుధ్య సిబ్బంది నెట్టుతూ స్టార్ట్ చేస్తున్నారు. ఓ ట్రాక్టర్‌కు ఏకంగా ఏడు నెలలుగా సెల్ఫ్ లేదనితెలుస్తోంది. అలాగే మరమ్మత్తులకు లోనయ్యే ఆటో ట్రాలీలకు సకాలంలో మరమ్మతులు చేయించకపోతుండటంతో రోజుల తరబడి మెకానిక్ షెడ్లకే పరిమితమవుతున్నట్టు ప్రచారంలో ఉన్నది. అలాగే కొన్ని వాహనాలకు మాత్రమే బీమా ఉండగా మిగతా వాహనాలకు బీమా చేయడాన్ని అధికారులు విస్మరించారని పలువురు అంటున్నారు. దీంతో వాహనాల ఇబ్బందులపై ప్రతీ రోజు అధికారుల దృష్టికి తీసుకువెళుతున్నప్పటికీ తమకు చీవాట్లే ఎదురవుతున్నాయని పారిశుధ్య సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే వాహనాల స్టార్టింగ్ ట్రబుల్- మునిసిపల్ పనితీరును నిదర్శమని ప్రజలు సెటైర్స్ వేస్తుండటం గమనార్హం. ఈ మేరకు మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎండీ.జాఫర్ అలీ స్పందిస్తూ త్వరలోనే వాహనాలన్నింటికీ మరమ్మతులు చేయిస్తామని అన్నారు. వాహనాల నిర్వహణపై అప్రమత్తంగా ఉన్నాయని చెబుతున్నారు.



భువనగిరి మునిసిపల్ శానిటేషన్ ట్రాక్టర్‌ను నెడుతున్న సిబ్బంది

కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం రూపొందించాలి

సంస్థాన్‌నారాయణపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం సమగ్ర చట్టం రూపొందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.ఇమ్రాన్ డిమాండ్ చేశారు. సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో గురువారం ప్లంబర్ అండ్ ఎలక్ట్రీషియన్ కార్మికులు కొందరు ఏఐటీయూసీ యూనియన్‌లో చేరిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, పల్లె మల్లారెడ్డి, వీరమళ్ల యాదయ్య, ముత్యాల అంజయ్య, ఎర్రోళ్ల లింగస్వామి, దుబ్బాక సంజీవ, బోయ శంకరయ్య, సింగపంగ రమేశ్ పాల్గొన్నారు.

'ప్రైవేట్ కళాశాలల' అధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డి

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడిగా తీకుళ్ల శ్రీనివాస్‌రెడ్డి (స్పందన డిగ్రీ కళాశాల- సూర్యాపేట) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చౌటుప్పల్ పట్టణంలో గురువారం కళాశాలల యాజమాన్యాలు సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ సత్యం గౌడ్ (శ్రీ సంతోష్ డిగ్రీ కళాశాల- మోత్కూర్) , కోశాధికారిగా ఎస్. హనుమంత్ యాదవ్ (భారతి డిగ్రీ కళాశాల- మాల్), ఉపాధ్యక్షుడిగా మెండు వెంకట్ రెడ్డి (విజేత డిగ్రీ కళాశాల - సూర్యాపేట) , బీమిడి సుభాష్ రెడ్డి (శ్రీ గాయత్రీ డిగ్రీ కళాశాల- చౌటుప్పల్) , జాయింట్ సెక్రటరీలుగా ఆంజనేయులు, ప్రవీణ్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బత్తుల శంకర్ (నలంద డిగ్రీ కళాశాల - చౌటుప్పల్), కమిటీ సభ్యులుగా నాగేందర్ రెడ్డి, సైదారావు, భాస్కర్ రావు, ఎం. సుభాష్ రెడ్డి లను ఎన్నుకున్నారు.

పారిశుధ్య చర్యలు చేపట్టాలి

రామన్నపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు లేక పారిశుధ్యం పడకేసిందని మాజీ ఎంపీపీ నాగటి ఉపేందర్, మాజీ సర్పంచ్ బోయిన ఆనంద్ అన్నారు. మండలంలోని నీర్నెముల గ్రామంలో గత రెండు నెలల నుంచి గ్రామానికి ఇంటింటికీ మంచినీరు సరఫరా అయ్యే గేట్‌వాల్వ్ లీకేజీ కారణంగా బురదనీరు సరఫరా అవుతోందని తెలిపారు. సంబంధిత అధికారికి చెప్పినా నిధులు లేవని చెబుతున్నాడని పేర్కొన్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో సమస్యలు పరిష్కారం కాకుండా మరింతగా పేరుకుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రామన్నపేటలో నేడు జాతీయ సదస్సు

రామన్నపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య సాహిత్యం సమాలోచనం అను అంశంపై జాతీయ సదస్సును ఈనెల 19వ తేదీన నిర్వహించనున్నట్లు కళాశాల ప్రధానాచార్యులు రహత్‌ఖానం, తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య తెలిపారు. సదస్సులో ప్రారంభ సమావేశానికి ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి కూనూరు లక్ష్మణ్, సభా ప్రారంభకులుగా మహాత్మా గాంధీ విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్, విశిష్ట అతిథిగా తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, కీలకోపన్యాసకులుగా హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడు పిల్లమర్రి రాములు, గౌరవ అతిథులుగా ఆచార్య సాగి కమలాకర్ శర్మ, డాక్టర్ బెల్లి యాదయ్య హాజరవుతారని తెలిపారు. అన్నారు. ఈ సదస్సులో 36 మంది వివిధ విశ్వవిద్యాలయాల, కళాశాల పాఠశాలల ఆచార్యులు అధ్యాపకులు ఉపాధ్యాయులు కూరెళ్ళ విఠలాచార్య వివిధ రచనలపై పత్రాలు అందజేస్తారని వారు తెలిపారు.

'నియోజకవర్గం ఏర్పాటు చేయాల్సిందే'

రామన్నపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రామన్నపేటను నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలని నియోజకవర్గ సాధన సమితి సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు సమితి ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్‌కు 500 మంది సంతకాలను సేకరించి, కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వానికి డీలిమిటేషన్ కమిటీకి సిఫారస్ చేస్తానని అన్నారన్నారు. వినతిపత్రం అందజేసినవారిలో నియోజకవర్గ సాధన సమితి గౌరవాధ్యక్షుడు పోతరాజు శంకరయ్య, అధ్యక్షుడు బొడ్డుపల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వరికల్లు గోపాల్, బొడ్డు శంకరయ్య, నల్ల నరేందర్, యాదయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో ఉత్తమ విద్యాబోధన : ఏసీ



రోబోటిక్స్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, డీఈవో

భువనగిరిటౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన అందించాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. భువనగిరిలోని కేజీబీవీలో రోబోటిక్స్ ల్యాబ్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఈవో సత్యనారాయణ మాట్లాడుతూ ఐవోసీఎల్ సహకారంతో రోబోటిక్స్ క్లాస్‌రూమ్ ఏర్పాటు చేసిన టికే కె.పవన్‌ను అభినందనీయుడని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వరంగ సంస్థలు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వరరావు, నిర్మాణ్ సంస్థ ప్రతినిధి అనూష తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద నివారణకు చర్యలు



భువనగిరి వీధి కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

భువనగిరిటౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భువనగిరి పట్టణ ప్రజలను హడలెత్తిస్తున్న వీధి కుక్కల నియంత్రణకు మునిసిపాలిటీ ప్రయత్నాలు ప్రారంభించింది. బస్తీల్లో స్వేచ్ఛగా సంచరిస్తున్న వీధి కుక్కలను పట్టుకుని జంతు నియంత్రణ కేంద్రానికి తరలించి పునరుత్పత్తి నివారణకు చికిత్సలు చేస్తున్నారు. ఈ మేరకు రెండు రోజులుగా పట్టణంలో 45 వీధికుక్కలను పట్టుకున్నారు. పట్టణ శివారులో నిర్మించిన జంతు జనన నియంత్రణ కేంద్రంలో వీటికి శస్త్రచికిత్సలు చేసి మూడు రోజుల అనంతరం వదిలేయనున్నారు. ఒక్కో వీధి కుక్క శస్త్రచికిత్స, మూడు రోజుల ఆహారానికి ఏబీసీ ఏజెన్సీకి మునిసిపాలిటీ రూ.1650 చెల్లిస్తుంది. శస్త్రచికిత్సలతో పునరుత్పత్తి నిలిచిపోయి కొద్దికాలంలో వీధి కుక్కల బెడద తప్పుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఏడాది క్రితం సుమారు 1300 కుక్కలకు శస్త్రచికిత్సలు నిర్వహించారు. పట్టణంలో సుమారు 4వేల వీధి కుక్కలు ఉన్నట్లు అధికారుల అంచనా. అయితే శస్త్రచికిత్సల అనంతరం వాటిని దూర ప్రాంతాల్లో, అటవీప్రాంతాల్లో వదిలేస్తేనే భువనగిరిలో వీధికుక్కల బెడద తగ్గుతుందని, పట్టుకున్న చోటే వదిలేస్తే సమస్య యథావిధిగా ఉంటుందని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మోత్కూరు పీహెచ్‌సీలో నిర్వహించిన వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్

బొమ్మలరామారం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుల వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బొమ్మలరామారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుమలత అన్నారు. ప్రధానమంత్రి భారత స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని గోవిందుతండాలో బీబీనగర్ ఎయిమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు వైద్యులు పని చేస్తున్నట్లు తెలిపారు. తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఎనీమియాపై అవగాహన, స్క్రీనింగ్‌ను కమ్యూనిటీ ఫ్యామిలీ మెడిసిన్, పాథాలజీ విభాగాలకు చెందిన వైద్యులు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో అసోసియేషన్ ప్రొఫెసర్ డాక్టర్ వామన్, కులకర్ణి, పంచాయతీ కార్యదర్శి సురేష్, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీతేజ, శ్రీ భరత్, ఆరోగ్య అధికారులు పాల్గొన్నారు.

మోత్కూరు: మోత్కూరు పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పి.జ్యోతి, మునిసిపల్ కమిషనర్ కె.సతీష్‌కుమార్ మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆశ్రిత, డాక్టర్ ఎం.సాయిరమణి, డాక్టర్ యతిరాజవల్లి, డాక్టర్ రజనికుమారి, పీహెచ్‌సీ డాక్టర్లు హేమంత్‌కుమార్, అమరావతి, సీహెచ్‌వో దేవకి, పీహెచ్ఎన్ సబిత తదితరులు పాల్గొన్నారు.

గుండాల: మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో నిర్వహించిన వైద్యశిబిరంలో మహిళలకు ఆరోగ్య పరిరక్షణ, పోషకాహారం, సురక్షిత ప్రసవాలు, రక్తహీనత నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకుంటూ పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వప్న, డాక్టర్ కౌశిక్ కుమార్, డాక్టర్ ప్రీతి స్వరూప్, సీహెచ్‌వో వెంకటేష్, సీహెచ్ఎన్ వనజకుమారి, రవి పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో మౌలిక వసతులు కల్పించాలి

మోటకొండూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో మౌలిక వసతులు కల్పించాలని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాదుల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని గురువారం వారు పరిశీలించి మాట్లాడారు. పీహెచ్‌సీలో సదుపాయాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాతలు సమకూర్చిన అంబులెన్స్‌కు డ్రైవర్ లేకపోవడంతో మూలకు పడేశారని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు మారుజోడు సిద్దేశ్వర్, సహాయ కార్యదర్శి చిరబోయిన బాలకృష్ణ, వడ్లకొండ నాగరాజు, వెంకటేష్, సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

వలిగొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 23,24 తేదీల్లో నిర్వహించే రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రాజకీయ శిక్షణ తరగతుల కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ శిక్షణ తరగతులకు రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, స్థానికసంస్థల ఎన్నికల ఎత్తుగడలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేశం, కిష్టయ్య, గర్దాసు నర్సింహ, బిక్షపతి, లక్ష్మయ్య, బాలయ్య పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : యువజన, స్వచ్ఛంద సంస్థలు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ డాక్టర్ సీత సత్యనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ నూతన కార్యవర్గాన్ని సభ్యులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం 15వ వార్షిక సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సీత సత్యనారాయణ సమక్షంలో నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా ఆయనయ ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా కోడి బాలరాజ్, గౌరవాధ్యక్షుడిగా తుమ్మ అంబదాసు, ఉపాధ్యక్షులుగా చిట్టిమల్ల ఐలయ్య, కేమ విష్ణుమూర్తి, ప్రధాన కార్యదర్శిగా సకినాల నాగయ్య, సహాయ కార్యదర్శిగా పున్న యాదగిరి, మేకం పాండు, కోశాధికారిగా ఆడెపు భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా బోగ సత్యనారాయణ, కుర్వి గోవర్దన్, గుజ్జ శ్రీనివాస్, బడుగు ల్మోణ్, బోగ యాదగిరి, పున్న నాగేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. వారిచేతో డాక్టర్ సీత సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు.

వెదురు ఉత్పత్తులనే వాడాలి

భువనగిరి టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వస్తువులను బహిష్కరించి, ప్రజలంతా వెదురు ఉత్పత్తులనే వాడాలని జిల్లా మహేంద్ర (మేదరి) సంఘం నాయకులు కోరారు. సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వెదురు దినోత్సవాన్ని గురువారం భువనగిరిలో ఉత్సాహంగా నిర్వహించారు. వెదురు బొంగుల కొనుగోలుకు గత ప్రభుత్వం మాదిరిగానే నేటి ప్రభుత్వం సబ్సిడీ కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఏవి కిరణ్‌కుమార్, సంఘం నాయకులు వాసం శ్రీనివాస్, ఎలుముల భాస్కర్, తుమ్మల బుచ్చిరాములు, వాసం శంకర్, వాసం వెంకటేష్, ధనలక్ష్మీ, లక్ష్మీ, రేణుక, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎల్‌వోసీ అందజేత

భువనగిరి రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందనం గ్రామానికి చెందిన కడమంచి జనార్ధన్ అనారోగ్యంతో బాధపడుతు మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి రూ.2.50లక్షల విలువ గల ఎల్‌వోసీని అందజేశారు. గతంలోనూ రూ.2.50లక్షల చెక్కును అందచేయగా మొత్తం రూ.5లక్షలు ఎల్‌వోసీని అందచేసినట్లు పూర్ణగిరి లక్ష్మీనర్సింహస్వామి చైర్మన్ రావి సురేందర్ రెడ్డి తెలిపారు.

కల్లు గీత కార్మిక మహాసభను విజయవంతం చేయాలి

ఆత్మకూరు(ఎం) సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో ఈ నెల 24వ తేదీన నిర్వహించే కల్లు గీత కార్మిక సంఘం నాలుగో మండల మహాసభను జయప్రదం చేయాలని ఆసంఘం మండల అధ్యక్షుడు రంగ సత్యనారాయణ, గౌడ సంఘం అధ్యక్షుడు పంజాల నర్సయ్య కోరారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలో మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల గౌడ సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గడ్డం దశరథ, చందర్, రాజు. వెంకన్న. జహంగీర్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

వలిగొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోతుకుంట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. లీగల్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్, స్పెషల్ ఆఫీసర్ దుర్గ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

అడ్డగూడూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) అడ్డగూడూరు మండలంలోని కోటమర్తి గ్రామానికి చెందిన చిప్పలపల్లి శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం 2003 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అతని సతీమణి అయిన రామాంజ 2003 ఎస్ఎస్‌సీ బ్యాచ్ సహచర విద్యార్థులు రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు పాశం సత్యనారయణ 50కేజీల బియ్యాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.

రైతులకు మెరుగైన సేవలు

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మెరుగైన సేవలను అందిస్తుందని పీఏసీఎస్ మాజీ చైర్మన్ చెన్నగోని అంజయ్య గౌడ్ అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని పీఏసీఎస్ కు ప్రత్యేకాధికారిగా బాధ్యతలను స్వీకరించిన కే.సురేష్‌ను గురువారం అంజయ్య గౌడ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొడిగే ఆనంద్ గౌడ్, జి. నరహరి, చెవెళ్లి కృష్ణ, ఎర్ర వెంకటేశం, ఆర్. మహేష్, ఉప్పు వెంకటేశం లు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఏకగ్రీవం

ఆలేరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా చింతకింది మల్లయ్య, కార్యదర్శిగా పడిగల రాములు, ఆర్థిక కార్యదర్శిగా వంగపల్లి మల్లేశం, అసోసియేట్ అధ్యక్షుడిగా బి.దామోదర్, ఉపాధ్యక్షులుగా సీవీ రామనర్సయ్య, ఎం.జానమ్మ, సహాయ కార్యదర్శిగా ఎస్.బాలకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఏ.యాదగిరి, ప్రచార కార్యదర్శిగా వి.మధుసూదన్, జిల్లా కౌన్సిలర్లుగా వి.ఉపేందర్‌రెడ్డి, మంద సోమరాజు, తోట మల్లయ్య ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కమిటీ ప్రతినిధులను సంఘం ప్రతినిధులు శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

మదర్ డెయిరీ డైరెక్టర్ పదవికి కొండల్‌రెడ్డి నామినేషన్

యాదగిరిగుట్ట రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారిగూడెం గ్రామానికి చెందిన పాలసొసైటీ చైర్మన్ మారెడ్డి కొండల్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో మదర్‌డెయిరీ డైరెక్టర్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో మదర్‌డైరీ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, గుట్ట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, నాయకులు సట్టు తిరుమలేష్, దొంతిరి సోమిరెడ్డి, సందిల భాస్కర్‌రెడ్డి, ఒగ్గు బిక్షపతి ఉన్నారు.

పండుగపూట.. పస్తులేనా?

(5వ పేజీ తరువాయి)

నియమించుకుని వేతనం ఇచ్చేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పాఠశాలలను శుభ్రంచేయడానికి స్కావెంజర్లను నియమించుకునే అవకాశం ఇవ్వడంతో ఉపాధ్యాయులకు భారం తప్పింది. స్కావెంజర్లను నియమించుకోవడానికి అవకాశం కల్పించినప్పటికీ వారి పేర్లు రికార్డుల్లో నమోదు చేయవద్దని మెలిక పెట్టింది. రికార్డులో పేర్లు ఉంటే కొంతకాలం తర్వాత వారు వేతనాలు పెంచాలని, రెగ్యులర్ చేయాలని ఆందోళ చేస్తారన్న తలంపుతో ముందు జాగ్రత్తగా స్కావెంజర్ల పేరు పాఠశాల రిజిస్టర్లలో రాయడం లేదంటున్నారు. ప్రభుత్వం స్కావెంజర్ వేతనాన్ని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, పాఠశాల హెచ్ఎం పేరున ఉన్న జాయింట్ బ్యాంకు ఖాతాలో జమ చేస్తే వారు తీసి స్కావెంజర్‌కు చెల్లిస్తారు. ఐదారు రోజుల్లో బతుకమ్మ, దసరా పండుగలు వస్తున్నందున ప్రభుత్వం వెంటనే తమకు వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు, గ్రామ పంచాయతీ కార్మికులకు సైతం

ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లకు, గ్రామపంచాయతీ కార్మికులకు రెండు నెలల (జూలై, ఆగస్టు) వేతనాలు అందలేదు. జిల్లాలో 400 మందికి పైగా ఫీల్డ్ అసిస్టెంట్లు, సుమారు 2వేల మంది గ్రామపంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు నెలకు రూ.10వేలు, గ్రామపంచాయతీ కార్మికులకు నెలకు రూ.9,500 వేతనం చెల్లిస్తున్నారు. ఆ తక్కువ వేతనం కూడా నెలనెలా ఇవ్వకపోవడంతో కుటుంబాలను పోషించుకోవడానికి తాము నానా యాతన పడుతున్నామని వారు ఆవేదన చెందుతున్నారు. గ్రామాల్లో కూలి పనులకు వెళ్లి ఆరేడు గంటలు పనిచేస్తే రోజుకు రూ.500 కూలి ఇస్తారని, రోజంతా పనిచేసినా తమకు ప్రభుత్వం ఇచ్చే వేతనం రోజుకు రూ.350 అయినా పడటం లేదంటున్నారు. భవిష్యత్‌లో వేతనాలు పెరుగపోతాయా? అన్న ఆశతో చేస్తున్నామంటున్నారు. రెండు నెలలుగా వేతనాలు ఇవ్వక పోవడంతో ఇబ్బంది పడుతున్నామని బతుకమ్మ, దసరా పండుగలు వస్తున్నందున తమకు వెంటనే వేతనాలు చెల్లించాలని వారు కోరారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని పలువురు బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం బీజేపీ ఆధ్వర్యంలో జిల్లాలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ దేశం ప్రపంచంలోనే నాలుగవ ఆర్థిక శక్తిగా ఎదిగిందన్నారు. మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. స్వచ్ఛభారత్‌తో పరిసరాలు పరిశుభ్రం అవుతున్నాయని అన్నారు. వీధులను శుభ్రం చేసి మలేరియా, డెంగ్యూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాలోని పలు చెరువులు, చెరువుకట్టలు, ఆసుపత్రి పరిసరాల్లో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.

● భువనగిరి పట్టణంలోని భువనగిరి పెద్ద చెరువు కట్టను బీజేపీ నాయకులు, కార్యకర్తలు శుభ్రం చేసి, చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలను తరలించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ మాయ దశరథ మాట్లాడుతూ 15రోజులపాటు నిర్వహిస్తున్న సేవాపక్షంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుర్వి శ్రీనివాస్‌గౌడ్, డీఎల్ఎన్‌గౌడ్, ఆకవరం వైజయంతి, ఆర్.కృష్ణచారి, కొల్లోజు శ్రవణ్, కె. మల్లికార్జున్, యాట వెంకటేష్, కె.రమేష్, నరాల రాజు, తాడూరి రాజు, ఉషాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

● తుర్కపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో నాయకులు కుల సైదులు, శత్రునాయక్, మాలోతు రమేష్ నాయక్, మేకల శ్రీనివాస్‌యాదవ్, యాట పెంటయ్య, లక్ష్మీనారాయణ, రమేష్, చాంద్‌పాషా, రామచంద్రం, రాజుగౌడ్ పాల్గొన్నారు.

● రాజాపేటలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మేకల రమేష్, దాచపల్లి శ్రీనివాస్, సాదనబోయిన శంకర్, బూర్గు శేఖర్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, బీరయ్య, చంద్రమోహన్, లక్ష్మణ్, శ్రీహరి పాల్గొన్నారు.



భువనగిరి పెద్ద చెరువు కట్టను శుభ్రం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

● బొమ్మలరామారం పీహెచ్‌సీలో నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్, మండల కన్వీనర్ ఆనంద్‌గౌడ్, మౌనిక, సాయికుమార్, బిమారి రాజు, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా మాజీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, నాయకులు రవిశంకర్, డాక్టర్ పాండు, బాలకృష్ణారెడ్డి, గోపాల్, ఈశ్వర్ గౌడ్, గణేష్, ప్రవీణ్‌రెడ్డి, మహేష్, రాము, సతీష్ పాల్గొన్నారు.

● బీబీనగర్‌లో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రోడ్డు ఊడ్చి శుభ్రం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భువనగిరి సదానంద్‌గౌడ్, సేవా పక్షం కన్వీనర్ రామచందర్, ఇంజమూరి ప్రభాకర్, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, రేణుక, శ్రీకాంత్‌గౌడ్, బాల్యానాయక్ పాల్గొన్నారు.

● ఆలేరులోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, శ్రీరామకృష్ణ విద్యాలయం విద్యార్థులు ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయి విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో శ్రీరామకృష్ణ విద్యాలయం హెచ్ఎం బండి రాజుల శంకర్, బీజేపీ మండల పట్టణ అధ్యక్షుడు పూజారి కుమారస్వామిగౌడ్, నాయకులు నంద గంగేష్, అచ్చయ్య, నరేందర్, కృష్ణ, దశరథ, శంకర్, సుభాష్, సృజన్‌కమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

● చౌటుప్పల్ మునిసిపాలిటీలోని 3వ వార్డులో బీజేపీ పట్టణ అ ధ్యక్షురాలు కడారి కల్పనయాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు ప్రా థమిక పాఠశాల ఆవరణలో పేరుకు పోయిన చెత్తా, చెదారాన్ని బీజే పీ కార్యకర్తలు తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామనగోని శంకరయ్య, నాయకులు ఈ.దామోదర్‌రెడ్డి, కడారి అ యిలయ్య ఊదరి రంగయ్య, పర్నె శేఖర్‌రెడ్డి, ఎ.మల్లేశం, కృష్ణ, శ్రీధర్, గణేష్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

● మోత్కూరులో శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు చాడ మంజుల, నాయకులు గౌరు శ్రీనివాస్, పోచం సోమయ్య, తీగల శ్రీధర్‌గౌడ్, జినుకల దశరథ, అన్నెపు సత్యనారాయణ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

● వలిగొండ మండలంలోని సంగెం-వర్కట్‌పల్లి గ్రామాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి, మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్, కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఏలే చంద్రశేఖర్, మంద నర్సింహ, కందుల తనీషా, రాజేశ్వర్‌చారి, సుధాకర్‌గౌడ్, లోడే లింగస్వామిగౌడ్, నాగరాజు, నాగయ్య, సాగర్‌గౌడ్, భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.